

## ఓటర్ల సర్వేను పరిశీలించిన ఆర్‌డిఒ

**ప్రజాశక్తి -ఉప్పలగుప్తం**

మండలంలోని చల్లపల్లి, సరిపల్లి, విలసవిల్లి గ్రామాలలో జరుగుతున్న ఇంటింటా ఓటర్ల సర్వేను మంగళవారం అమలాపురం ఆర్‌డిఒ బి.వసంత రాయుడు తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరితో కలిసి పరిశీలించారు. ఓటర్ల నమోదు ఫారం-6,ఫారం-8 లతోపాటు మరణించిన వారు శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లినవారు వంటి వారి వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని బి ఎల్ ఒ లను ఆయన ఆదేశించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల సర్వేలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాలంటీర్లకు అనుమతి లేదన్నారు. ఆయన వెంట మండల రెవెన్యూ అధికారి ఎంవి రమణ, విఆర్‌ఒలు ఉన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వసంతరాయుడు

# వేడెక్కిన రామచంద్రపురం రాజకీయం

### కుమారుని కోసం పావులు కదుపుతున్న ఎంపీ బోస్

**ప్రజాశక్తి-రామచంద్ర పురం**

అసెంబ్లీ ఎన్నికలకు మరో కొన్ని నెల సమయం ఉండటంతో రాజకీయ నాయకులు రాజకీయ చతురతతో వ్యూహాలు రూపొందించుకుంటున్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం గల ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎత్తులు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్నారు. వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశాల్లో వేడెక్కిన రామచంద్రపురం రాజకీయం అధిష్ఠానం బ్రేక్ వేయడంతో కొంత చల్లబడినప్పటికీ చాప కింద నీరులా బోస్ వ్యవహరిస్తున్న తీరుతో కార్యకర్తలు నాయకులు ముఖ్య అనుచరులు రామచంద్రపురంలోని బోస్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. దీంతో నిత్యం బోస్ కార్యాలయం ప్రజలతో కళకళలాడుతుండగా ప్రత్యర్థులకు ఈ వ్యూహాలు మింగుడు పడటం లేదు. పట్టణ పరిధిలోని నాయకులు, కార్యకర్తలను నిత్యం టచ్ లో ఉంటూ బోస్ తనప్రైన వ్యూహం తిప్పుతుండగా తనయుడు పిల్లి సూర్యప్రకాష్ గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లోనూ పర్యటన ప్రజల మద్దతు కోరుతూ 80శాతం వరకు గ్రామాల్లో పర్యటన ముగించారు. సర్వేలు జరుగుతున్నాయని అధిష్టానం ప్రకటించినప్పటికీ చాప కింద నీరుల తండ్రి కొడుకులు తమ వ్యూహాలకు పదును పెడుతూ మరింత వేగంగా కార్యక్రమాలు పూర్తి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గంలోని కార్యకర్తలను అభిమానులను వైసిపి నాయకులను పిలిచి అందరి సమక్షంలోనూ తన రాజకీయ వారసుడిగా సూర్యప్రకాష్ పరిచయం చేసి నీతి నిజాయితీగా పనిచేయాలని ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మరోవైపు మంత్రి వేణుకు సీటు ఇస్తే తాను సహకరించనని చెప్పిన బోసు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

**మంత్రి వేణుపై పెరిగిన వ్యతిరేకతను**

**తనకు అనుకూలంగా మార్చుకున్న బోస్**

రామచంద్రపురం ఎంఎల్ఎగా ఎన్నికై అనంతరం సమీకరణలో భాగంగా మంత్రి అయిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఆయన కనుసన్నల్లో గెలిచిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల నాయకులు మున్సిపల్ నాయకులు తమకు తూతూ మంత్రంగా పదవులు ఇచ్చారు గాని అన్ని ఆయనే చెలాయిస్తున్నారని అసంతృప్తి గురయ్యారు. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా ఆయనతో తిరగవలసి వస్తుంది గాని వారందరికీ ఇచ్చిన పదవులు చెల్లని నాణేలని బహిరంగంగా విమర్శిస్తున్నారు. మరోవైపు వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశాలలో మంత్రి రూ.ఆరుకోట్లతో నిర్మించిన ఇల్లు అవినీతిమయమని బహిరంగంగా విమర్శించారు. మరోవైపు తనను విమర్శించిన వారిపై కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని బోసు అధి స్థానం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పలువురు రాజీనామా లకు సిద్ధమయ్యారు.

**నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో మంత్రి విఫలం**

మరోవైపు రామచంద్రపురం నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో మంత్రి వేణు విఫలమయ్యారు. పట్టణవాసులని వేధిస్తున్న చోడవరం కబేలా నేటికీ ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. మరోవైపు భీమేశ్వరాలయానికి ప్రధాని రహదారి ద్రాక్షారామ రామచంద్రపురం రోడ్డు. అదేవిధంగా యానం ద్రాక్షారామ రోడ్డు. వెల్ల ఆదివార పేట రోడ్డు, ఎర్ర పోతవరం, శివల రోడ్డు, దంగేరు రోడ్డు, ఏటిగట్టు రోడ్డు ప్రయాణం సమస్యలుగా ఉండిపోయాయి. మరోవైపు కె.గంగవరం మండలంలో మంచినీటి సమస్యలు నీటికి పరిష్కారం కాలేదు.. అదేవిధంగా ద్రాక్షారామంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరిస్తానన్న మంత్రి నేటికీ అమలుకు నోచుకోలేదు. వీటితో పాటుగా ద్రాక్షారామంలో రైతు బజార్. కాకినాడ కోటిపల్లి మీదుగా నరసాపురం వరకు హైవే రోడ్ లో ఈ ప్రాంతాల రోడ్డు రోడ్లను విలీనం చేయడానికి ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు అవి కూడా అమలుకు నోచుకోలేదు.తో పాటుగా పాతకోట మసకపల్లి వద్ద అనధికార ఇసుకరాంపులపై నిర్వాహణ, జగన్ కాలనీలో మట్టి ఫిల్లింగ్ తన అనుచర గణం తో చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అసంతృప్తితో ఉన్న నాయకులను కార్యకర్తలను తమ వైపు తిప్పుకోవడంలో బోస్ వ్యూహం ఫలించింది. ఎవరికి ఏ అవసరం వచ్చినా తను వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని తాను తన కుమారుడు ఎవరికి ఏ సహాయం కావాల్సిన తమ వంతు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామాల్లోని వైసీపీ నాయకులు కార్యకర్తలు బోసు కార్యాలయానికి క్యూ కడుతున్నారు. విషయం గమనించిన ప్రత్యర్థులకు దీనిని ఎలా ఎదుర్కోవాలో అంటూ అంతర్మధనానికి గురవుతున్నారు



బోస్ ఇంటి వద్ద పోటెత్తిన అభిమానులు, వైసిపి కార్యకర్తలు

## పాలనలో కార్యదర్శులదే కీలక పాత్ర

**ప్రజాశక్తి-అమలాపురం రూరల్**

రిఫ్రెషర్ శిక్షణ (కెపాసిటీ బిల్డింగ్) కింద పని తీరును మెరుగుపరుచుకుని సమర్ధవంతంగా పనిచేస్తూ గ్రామ పంచాయతీల పరిపాలనలో కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకార్యదర్శులకు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 392 కార్యదర్శులకు 4 బ్యాచ్‌ల్లో బ్యాచ్‌కు 100 మంది చొప్పున ఒక్కొక్క బ్యాచ్‌కు వారం రోజులు పాటు రిఫ్రెషర్ ట్రైనింగ్ క్లాసులను నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమ మొట్టమొదటి బ్యాచ్ శిక్షణను మంగళవారం జిల్లా కలెక్టర్ స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామపంచాయతీలలో అనధికారిక లేఅవుట్లు ఎక్కువగా ఏర్పడకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్ చట్టాల పట్ల పూర్తి అవగాహనను మాస్టర్ ట్రైన్ ద్వారా పెంపొందించుకొని గ్రామస్తులకు సుపరిపాలన అందించాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహనను పెంపొందించుకొని గ్రామపంచాయతీల ఆర్థిక పరిపుష్టికి పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాలన్నారు. గ్రామ సచివాలయ వాలంటీర్ల వ్యవస్థ సహకారంతో గ్రామ పంచాయతీల లో గాంధీజీ కలలుగన్న స్వరాజ్య స్థాపన దిశగా పూర్తి సమన్వయం వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ వి.కృష్ణకుమారి, ఎంపిడిఒ జయ వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ బొద్దిరాజు, డిఎల్‌డిఒ విజయ థామస్, టౌన్ ప్లానింగ్ అధికారి సుబ్బారావు, మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

## టిడ్కో గృహాల కేటాయింపు ఎప్పుడు?

**ప్రజాశక్తి-మండపేట**

స్థానిక గొల్లపుంత కాలనీలోని మిగిలిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఎప్పటికిస్తారని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులు ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంఎల్‌సీ తోట త్రిమూర్తులు హాజరయ్యారు. అజెండాలోని రెండు, పదవ అంశాలు కౌన్సిల్ లో చర్చకు వచ్చినపుడు ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడుతూ ఎవరో ఒకరు బాధ్యత తీసుకొని టిడ్కో గృహాల వద్ద పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలన్నారు. పట్టణ మాస్టర్ ప్లాన్ ఏమైందని ఆమోదించి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వానికి ఎందుకు నివేదించలేదని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఎంఎల్‌సి, మున్సిపల్ కమిషనర్ లు మాట్లాడుతూ గతంలో ప్రయివేటు ఏజెన్సీ ద్వారా మాస్టర్ ప్లాన్ ప్రెజెంటేషన్ చేసామని డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరిగిన తరువాత అభ్యంతరాలు తెలియజేయవచ్చున్నారు. భవిష్యత్ తరాలను దష్టిలో ఉంచుకుని ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి మాస్టార్ ప్లాన్ రూపొందిస్తారన్నారు. ప్రభుత్వం భూములు కొని పేదలకు తక్కువ రేటుకు అందించాలనే దిశగా మండపేట పట్టణంలో భూములు కొనేందుకు సిద్ధపడినప్పటికీ ప్రస్తుతం ఇక్కడ వున్న రేట్లకు ప్రభుత్వం కొనే ధరకు సంబంధం లేకపోవడంతో ఈ ప్రక్రియను ఆపమని ప్రభుత్వానికి చెప్పడం జరిగిందని ఎంఎల్‌సి తోట అన్నారు. సమావేశంలో వైస్ ఛైర్పర్సన్ లు పిల్లి గణేశ్వరరావు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

## ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి

**ప్రజాశక్తి-అమలాపురం**

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకై అన్ని ముందస్తు చర్యలతో సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి ఆమె వీడియో కాన్ఫరెన్స్ వ్యవసాయ, పౌరసరఫరాలు రెవెన్యూ అధికారులతో నిర్వహించారు.

**ఎన్నికల జాబితా పారదర్శకంగా రూపొందించాలి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పారదర్శకంగా ఎన్నికల సంఘం నిబంధనలను ఆచరిస్తూ పారదర్శకంగా ఖచ్చిత త్వంతో రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వివిధ జిల్లాల జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలుఅంశాలు పురోగతిపై సమీక్షించారు. కార్య క్రమంలో కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ అధికారులు సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి-మండపేట**

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక గొల్లపుంత కాలనీలో పిహెచ్‌సిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ టి.నాగలక్ష్మి, సిడిపిఒ ఎ.గజలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ బి.అనంతలక్ష్మిలు మాట్లాడుతూ బాలికలకు బాల్య వివాహాలు చేసి, బాధ్యత తీరిందని తల్లిదండ్రులు అనాలోచితంగా నిర్ణయాలు తీసుకొని వారి జీవితాలను నాశనం చేయవద్దన్నారు. బాలికల రక్షణ, సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. బాలికలు తమ రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేసిన చట్టాలను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, దిశా యాప్ వంటి వాటిపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ఏర్పాటుకు వినతి

**ప్రజాశక్తి-మండపేట**

అంబేద్కర్, బాబు జగ్జీవాన్ రామ్ విగ్రహాలను మండపేట పట్టణంలోని ప్రధాన కూడళిలో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని నియోజవర్గ దళిత నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ ఆవరణలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గరాణి కౌన్సిల్ సభ్యులకు మండపేట నియోజకవర్గ దళిత నాయకులు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. దళిత నాయకులు బూరిగ ఆశీర్వాదంముమ్మిడివరపు బాపిరాజు, పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్టూ'నిజం'





## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

**ప్రజాశక్తి-యంత్రాంగం**

తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లాలోని పాఠశాలల, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **అమలాపురం** తెలుగు వాడుక భాష ఉద్యమానికి ఆద్యుడు గిడుగు వెంకట రామమూర్తి అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతిని 'తెలుగు భాషా దినోత్సవం' పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ మాతభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి కషి వల్లే గ్రాంథిక భాషలో ఉన్న పాఠ్య పుస్తకాలు వ్యవహారికభాషలో ముద్రితమయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌ఒ సిహెచ్.సత్తిబాబు, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జెవిన్ మున్సిపల్ హై స్కూల్ నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. చడం జరిగింది.ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలుగు భాష విశ్రాంత ఉపాధ్యాయులు మాండలికం ఆదినారాయణ, బొంతు వివి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.**మండపేట** స్థానిక సంఘం కాలనీలోని ఎంపిపి పాఠశాల్లో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు విద్యార్థులందరు వివిధ కవులు, తెలుగు తల్లి, గిడుగు వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. తాపేశ్వరం శ్రీచైతన్య స్కూల్లో గిడుగు వెంకటరామమూర్తి పంతులు జన్మదినాన్ని పురస్క-రించుకుని తెలుగు భాషా దినోత్సవ వేడుకలుస్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్న సాంస్కతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో రీజనల్ ఇన్చార్జ్ నరేష్, వైస్ ప్రిన్సిపల్ రాము, డీన్అరుణ్, సి-ఇన్చార్జ్ సతీష్, ప్రైమరీ ఇన్చార్జ్ ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కొత్తపేట** విద్యా బాల మందిర్ హైస్కూల్ లో గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ ఆర్అనురాధ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు పేరాల బాబ్జీ మాట్లాడుతూ రామమూర్తి పంతుల తెలుగు భాషకు ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు తెలుగు పాటలు ఆలపించారు. **అమలాపురం రూరల్** కామనగరువు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం వీరవల్లి చక్రధర రావు అధ్యక్షతన మంగళవారం క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని, క్రీడల ప్రాధాన్యతను ఉపాధ్యాయ సిబ్బంది వివరించారు. అనంతరం తెలుగు భాష ఉపాధ్యాయుడు బాలర్జున సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు గొప్పతనం వివరించే సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహించారు. **రాజోలు:** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కత్తిమండ ప్రతాప్ కు గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషా పురస్కారం చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అందచేశారు. విజయవాడ లోని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యాలయం లో కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుభాషా, సాహిత్యరంగంలో విశిష్ట సేవలు చేసినందుకు ప్రతాప్ కు భాషా పురస్కారం అందించారు. తెలుగు భాషా తెలుగు సాహిత్య వ్యాప్తి కోసం నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు, తన రచనల ద్వారా తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతాప్ ను అభినంచి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ప్రవాస భారతీయ సొసైటీ చైర్మన్ మేడపాటి వెంకట్, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండల పరిషత్ కార్యాలయములో జరిగిన గిడుగు వెంకట రమణ మూర్తి జయంతిని కార్యక్రమంలో మంగళవారం ఎంపిడిఒ నాతి బుజ్జి, పరిపాలనాధికారి టి.వి.సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు **రామచంద్రపురం** ద్రాక్షారామంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీంతో పాటుగా హాకీ వీరుడు మేజర్ ధ్యానచంద్ పుట్టినరోజును పురస్కరించుకుని స్పోర్ట్స్ డే ను నిర్వహించారు. కార్యక్రమాలను ఉద్దేశించి ప్రిన్సిపాల్ గ్రంధి లీలా వంశీ కృష్ణ మాట్లాడుతూ తేనెకన్న తీయనైనది తెలుగు భాషని, మాతభాషను కాపాడుకోవాలన్నారు. రీజనల్ ఇంచార్జ్ నరేష్ మాట్లాడుతూ తెలుగు భాషకు అభివద్ధికి పలువురు కృషి చేశారన్నారు.. అనంతరం క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ రామ్మూర్తి, ప్రైమరీ ఇంచార్జ్ నీలిమ, ఎఒ గణేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



ద్రాక్షారామ శ్రీ చైతన్యలో తెలుగుభాషా దినోత్సవం

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**ప్రజాశక్తి-కాట్రేనికోన**

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ వేడుకలను మంగళవారం ప్రారంభించి మాట్లాడుతూ భారత హాకి క్రీడాకరుడైన ధ్యాన్ చంద్ పుట్టిన రోజును గౌరవ సూచకంగా భారత జాతీయ క్రీడా దినోత్సవముగా జరుపుకుంటు న్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్‌వియస్.పరమేశ్వరరావు మాటా ్లడుతూ ధ్యాన్ చంద్ 115 వ జయంతి ని క్రీడా. దినోత్సవవంగా నిర్వహిస్తున్నా మని అన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత ధ్యాన్ చంద్ ను ఆదర్శంగా తీసుకుని క్రీడల లో రాణించాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలైన వారికి మెడల్స్ ప్రదానం చేశారు.ఈ కార్యక్రంలో కళాశాల పాలక వర్గ సభ్యులు రమేష్ రాజు, సందీప్ లు కళాశాల ఫీజికల్ డైరెక్టర్ ఆలీ, కళాశాల విద్యాశాఖాధికారిణి జయలక్ష్మి , రత్నరాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులుపాల్గొన్నారు.

## ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి-మండపేట**

మండలంలోని తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు,భూషణం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ప్రపంచ హాకీ విజార్డ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించారున. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం వీరన్న, ఫిజికల్ డైరెక్టర్ కపవరం, అంతర్జాతీయ క్రీడాకారుడు వర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎంఎల్ఎ అసత్య ఆరోపణలు మానుకోవాలి

**ప్రజాశక్తి-మండపేట**

రైతుల ముసుగులో గ్రావెల్ తరలిస్తున్నారంటూ ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని పలువురు రైతులు అన్నారు. మండలంలోని కేశవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలంలోని ద్వారపూడి, మేడపాడు, కేశవరం గ్రామాల రైతులు మాట్లాడుతూ తమ గ్రామంలోని పుంత రోడ్ల అభివద్ధిని చూసి ఎంఎల్ఎ ఓర్వలేక పోతున్నారన్నారు. ఈ మూడు గ్రామాలలో గ్రావెల్ మట్టి తరలించుకు పోయి ఆయన సొంత లే ఔట్లకు వేసుకున్నారని మిగిలిన గ్రావెల్ ను చేల నుండి ధాన్యాన్ని మార్కెట్ కు తరలించేందుకు వీలుగా కాలువగట్లను అభివద్ధి చేస్తుంటే అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. గత మూడు పర్యాయాలుగా ఎంఎల్ఎ రైతుల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వైసిపి మండల అధ్యక్షుని పుట్టినరోజు

**ప్రజాశక్తి -ఐ పోలవరం**

ఐ.పోలవరం వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకట పతిరాజు పుట్టిన రోజు వేడుకలు కేశనకుర్రులోని ఆపార్టీ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు స్నేహితులు, అభిమానులు సమక్షంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వెంకటపతి రాజుతో కేక్ ను కట్ చేయించారు. ఆయనకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, జిల్లా కార్యదర్శి విత్తనాల శ్రీనివాసరావు, జిల్లా జనరల్ సెక్రటరీ రేవు అప్పారావు, మోకా రవి, సర్పంచు ల సమాఖ్య అధ్యక్షులు దంతులూరి రాఘవరాజు, సొసైటీ అధ్యక్షులు వడ్డి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటపతిరాజుకు కేక్ తినిపిస్తున్న ఎంఎల్ఎ

## ఘనంగా చిలుకూరి సతీష్ పుట్టినరోజు

**అంబాజీపేట** టిడిపి నేత, అమలాపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజు పుట్టినరోజు వేడుకలు అమలాపురం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పుల్లేటికురు గ్రామానికి చెందిన నాయకులు వక్కలంక బుల్లయ్య సతీష్‌రాజను సత్కరించారు.

## రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ

**ప్రజాశక్తి-రాజోలు**

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కు చంద్రబాబు గ్యారెంటీ ఇస్తున్నారని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ అన్నారు. మంగళవారం రాజోలు లో తమ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం అయిపోయిందన్నారు. రాష్ట్రంలో అన్నీ వర్గాల ప్రజల భవిష్యత్తు కు చంద్రబాబు గ్యారెంటీ ఇస్తున్నారని వెంకట రమణ అన్నారు.



బోళ్ల వెంకటరమణ

## శేరిలంకలో అంగన్‌వాడీ ఆయా పోస్ట్ భర్తీ

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

కె.గంగవరం మండలంలోని శేరిలంకలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టు ను మంగళవారం భర్తీ చేశారు. మంత్రి వేణు చేతుల మీదుగా ఆర్డర్ కాపీ ఆయాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ కొండేపూడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని పరిశీలించిన డిఎల్‌డిఒ

**ప్రజాశక్తి-మండపేట**

ఏడిద గ్రామంలోని ఒకటవ సచివాలయాన్ని రామచంద్రపురం డిఎల్‌డిఒ ఎ.శాంతి, ఇన్చార్జ్ ఎంపిడిఒ విఎన్.ప్రసాద్ తో మంగళవారం పరిశీలించారు. సచివాలయంలోని రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆమె సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మండల జెఇ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధికి పంట రుణాలు

**ప్రజాశక్తి-కపిలేశ్వరపురం**

భూమి లేని కౌలు రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో వారి ఆర్థికాభివృద్ధి కోసం సిఎం జగన్ వంట రుణాలు అందజేస్తున్నారని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. టేకి ఆర్‌బికెవద్ద వ్యవసాయ సలహా మండలి పుట్ట కృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గస్థాయిలో కవులు వ్యవసాయ నిపుణులకు పంట రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

**ప్రజాశక్తి-మండపేట**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ త్రిపర్ణ రామ్‌కుమార్ ను ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పట్టణ పరిధిలో అత్యధిక ధృవపత్రాలు జారీచేసి కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న నేపథ్యంలో కమిషనర్‌ను కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. వైస్ ఛైర్మన్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుకు దోపిడీపై టిడిపి నిరసన

**ప్రజాశక్తి-అమలాపురం**

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇసుక దోపిడీపై సత్యాగ్రహ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమలాపురం కలెక్టరేట్ ఆఫీస్ వద్ద టిడిపినాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు.అమలాపురం నియోజవర్గం ఇంచార్జ్, మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు,జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు ఇసుక సత్యాగ్రహ కార్యక్రమం కె.గంగవరంలో నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి సుబ్రహ్మ ణ్యం ఆదేశాలతో కె.గంగవరం మండల కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇసుక కాంట్రాక్టర్ గడువు ముగిసిన నకిలీ బిల్లులతో ఇసుక రవా ణా జరుగుతుందనీ, అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో ప్రొక్లైనర్ లతో ఇష్టం వచ్చినట్లు దోపిడి చేస్తున్నారని వీటిని అరికట్టాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలోపార్టీ అధ్యక్షులు మరివాడ చిన్నికష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, పార్లమెంట్ రైతు అధికారప్రతినిధి గన్ని శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో 'మహాశక్తి'

**ప్రజాశక్తి-అయినవిల్లి**

నల్లచెరువు గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్ అధ్యక్షతన నల్లచెరువు గ్రామశాఖ అధ్యక్ష,ప్రధాన కార్యాదర్శిలు రావూరి ప్రభాకరరావు, చుట్టుగుళ్ల శంకరంల ఆధ్వర్యంలోమహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## అరువు ఇవ్వలేదని దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

అరువుకు కిరాణా సరుకులు ఇవ్వలేదనే కారణంతో వ్యక్తి దాడి చేశాడు. ఈ ఘటన గిడజాంలో మంగళవారం చోటు చేసుకుంది. గిడజాం గ్రామానికి చెందిన చెక్క వెంకటేశ్వరరావు కిరాణాషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన జల్లు చిట్టిబాబు మంగళవారం కిరాణాషాపుకు వెళ్లాడు. కిరాణా సామన్లు అరువు అడగగా వెంకటేశ్వరరావు తిరస్కరించాడు. దీంతో ఆగ్రహంతో చిట్టిబాబు అతనిపై దాడికి దిగారు. వెంకటేశ్వరరావు తలకు రక్తపు గాయాలయ్యాయని ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

## గాయపడిన వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

బైకు అదుపుతప్పి కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందిందని చాగల్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఎం గంగమ్మ(60) ఈనెల 25న బంధువు వెంకట్లక్ష్మి తో కలిసి నిడదవోలు దేవాలయానికి వెళ్లింది. చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామానికి వచ్చేసరికి వెనక కూర్చున్న గంగమ్మ ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తరువాత కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గంగమ్మ మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హస్సేన్ తెలిపారు.

# ఇళ్ల స్థలాల సమస్యలపై కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఏటిపట్టు లోని 11 గ్రామాల ప్రజల ఇళ్ల స్థలాల సమస్యలపై కరపత్రాన్ని మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దాపురం నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంలో హడావుడిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే అధికారులకు ఏటిపట్టు 11 గ్రామాల పేదల ఇళ్ల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఇళ్ల స్థలాలను ఇచ్చిన అధికారులు ఈ 11 గ్రామాల ప్రజలకు మాత్రం 15 కిలోమీటర్ల దూరంలో రాళ్లు, రప్పలతో ఉన్న ప్రాంతంలో ఇళ్ల స్థలాల కేటాయించడం అన్యాయం అన్నారు. దూర ప్రాంతంలో ఇచ్చిన స్థలాల వద్దకు వెళ్లలేక, వాటిని వద్దనలేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. పట్టాలు ఇచ్చి 3 సంవత్సరాలు గడిచినా నేటికీ లబ్ధిదారులను అక్కడకు ఎందుకు పంపించలేకపోయారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఏ గ్రామంలో లబ్ధిదారులకు ఆ గ్రామ పరిధిలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కేదారి నాగు, నాయకులు పాపేశ్వరరావు, సిరపరపు శ్రీనివాస్, జి.సత్తిబాబు, జి.వీరబాబు, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు కృషి చేయాలి

### ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - గండేపల్లి


మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని, లక్ష్యసాధనలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు కావాల్సిన సామర్థ్యాన్ని తాము అందిస్తామని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల 2023-24 విద్యాసంవత్సరం బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించిన సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్య అనేది పరుగు పందెం లాంటిదన్నారు. ఈ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానం ఉండవని ఎంత వేగంగా పరిగెత్తావు, ఎంత దూరం పరిగెత్తావు అనేది మాత్రమే ఉంటుందన్నారు. ఆదిత్యలో చేరిన అధిక శాతం విద్యార్థులు పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనన్నారు. వారి లక్ష్యం మంచి కార్పొరేట్ ఉద్యోగం అయితే, ఆ కలల సాకారానికి ఆదిత్య సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఆదిత్యలో గత సంవత్సరం విద్యార్థులు సాధించిన ఉద్యోగాల గురించి వివరించారు. రూ.4 లక్షల వార్షిక వేతనంతో మొదలు రూ.19 లక్షల అత్యధిక వార్షిక వేతనం గల సుమారు 2,600 ఉద్యోగాలను విద్యార్థులు సాధించారని తెలిపారు. ఆంగ్లంపై పట్టు సాధించాలని, ఇంజనీరింగ్ సెమిస్టర్ విధానంలో జరుగుతుందని కావున 75శాతం అటెండెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, విభాగాధిపతులు డాక్టర్ సెల్వకుమార్, డాక్టర్ జి.చిన్నారావు, ఆదిత్య టెక్నికల్ హబ్ సిఇఒ బాబ్జి నీలం పాల్గొన్నారు. సుమారు 1000 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రచయిత డాక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ ప్రసంగం ఎంతగానో ఆకట్టుకుంది.

# యానాం వార్తలు


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - యానాం

యానాంలో పలు అభివృద్ధి పనులకు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. గోపాల్ నగర్‌లోని డ్రైన్ చానల్ వాల్, రోడ్డు నిర్మాణం, కనకాల పేట ఇండోర్ స్టేడియం క్రికెట్ నెట్ ప్రాక్టీస్ గ్రౌండ్ ఏర్పాటుకు ఎంఎల్ఎ గొల్లపల్లి, పరిపాలనాధికారి మునుస్వామి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎల్ఎ జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కాసేపు వాలీబాల్ ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రగాశం, ప్రజాపనులశాఖ ఇఇ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

ప్రజాశక్తి - యానాం


చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తాళ్లరేవు బైపాస్ రోడ్లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఆక్వా కంపెనీ మంగళవారం నష్టపరిహారం అందించింది. తొమ్మిది మంది కుటుంబాలకు సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున చెక్కులను కంపెనీ ప్రతినిధులు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.5.50లక్షలను కంపెనీ ప్రకటించగా రూ.3లక్షలు చొప్పున అందించారు. మిగిలిన రూ.2.50 లక్షలను బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. నష్టపరిహారం అందేవిధంగా కృషి చేసిన యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు బాధిత కుటుంబాలు ధన్యవాదాలు తెలిపాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

# నేడు జగ్గంపేటకు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట నియోజకవర్గ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని బుధవారం సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి వస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ తన కుమార్తె పద్మశ్రీఅన్నపూర్ణ వివాహం ఈనెల 30న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సిఎం జగన్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్, ఎస్‌పిలు పర్యవేఇంచారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపిపి తోట రవి, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, నాయకులు జనపరెడ్డి బాబు, కుంచే రాజా ఉన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

# రానున్న ఎన్నికల్లో టిడిపిదే గెలుపు

ప్రజాశక్తి కాకినాడరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిదే గెలుపు అని శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాకినాడ జిల్లాలో జోన్-2 టిడిపి నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు సెప్టెంబర్ 2న చంద్రబాబు రానున్నారు. ఈ సమావేశం నిర్వహణకోసం మంగళవారం స్థానిక తిమ్మాపురం అక్కూ ఎంఎస్ఎన్ క్యాంపస్ ఎదురుగా ఉన్న మీసాల రాజు ఖాళీ స్థలంలో జోన్-2 సభకు వారు భూమిపూజ నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు చేపట్టే వ్యూహాలను చంద్రబాబు ఈ సభలో దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, నాయకులు పిల్లి సత్యనారాయణ, పెంకే శ్రీనివాసబాబా, మీసాల రాజు, ఏసుదాసు పాల్గొన్నారు.

# 'చంద్రబాబుతోనే సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ప్రజా సంక్షేమ పాలన కావాలన్నా టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. పార్టీ చేపట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై టిడిపి కార్యాలయంలో మంగళవారం వనమాడి అధ్యక్షతన కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1నుంచి అక్టోబర్ 15వరకు జరిగే ఈ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు నాగిడి నాగేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పోలీస్ వెల్ఫేర్ పాత జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో గ్రంథాలయాన్ని ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పిల్లలు పోటీ పరీక్షల నిమిత్తం తర్ఫీదు పొందేందుకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాంశాలను, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలను ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వీటినిపూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఎఆర్‌బి.సత్యనారాయణ, సెబ్ అడిషనల్ ఎస్‌పి ప్రేమ్‌కాజల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్‌పి



# షాపుల అద్దె పెంపుదలపై కౌన్సిల్‌లో రగడ

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ షాపుల అద్దె పెంపుదల అంశాన్ని కౌన్సిల్‌లో చర్చించకుండా మళ్లీ ఎజెండాలో ఎలా పెట్టారని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను నిలదీశారు. చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో వ్యాపారాలు సక్రమంగా జరగక మున్సిపల్ షాపుల లీజు దారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో అద్దె పెంచుతూ గత నెల కౌన్సిల్ ఎజెండాలో పెట్టినప్పుడే ఈ అంశాన్ని వాయిదా వేశామన్నారు. మళ్లీ ఈ నెలలో కౌన్సిల్‌కు తెలీకుండా ఈ అంశాన్ని ఎందుకు ప్రవేశపెట్టారని అధికారులను నిలదీశారు. కౌన్సిల్ మాటకు విలువ లేకపోతే కౌన్సిల్ ఎజెండాలో అంశాలు పెట్టవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ సురేంద్ర వివరణ ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు, రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ విలువలు, నిబంధనల ఆధారంగా నూతన అద్దెలను పెంచుతూ ఈ జెండాలో అంశాలను పెట్టామన్నారు. దీనిపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ అంశానికి సంబంధించిన 2, 3 అంశాలను వ్యతిరేకించారు. దీంతో ఈ అంశాలను వాయిదా వేశారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ కౌన్సిలర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి తెలియజేసి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఇఇ ఆదినారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు, కో- ఆప్షన్స్ సభ్యులు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

# 'జగనన్న తోడు'తో వ్యాపారులకు రుణాలు

### హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రాష్ట్రంలో చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ద్వారా వత్తిడి లేని రుణాలు అందిస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని 400 మంది చిరు వ్యాపారులకు రూ.40 లక్షలు రుణాలను ఆయన మంగళవారం అందించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో చిన్న రుణం పొందాలన్నా బ్యాంకుల చుట్టూ, మధ్యవర్తుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. బ్యాంక్ రుణాలు అందకపోతే వారపు పద్దు వడ్డీ వ్యాపారులు ఆశ్రయించాల్సి వచ్చేదన్నారు. ఫలితంగా తీవ్రమైన ఒత్తిడి ఉండేదన్నారు. చిన్న వ్యాపారుల ఇబ్బందులను గమనించి జగన్ ప్రభుత్వం నేరుగా బ్యాంకులతో మాట్లాడి వారి అవసరాలను తీరుస్తూ అండగా నిలుస్తుందన్నారు. రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకుల వద్ద నమ్మకాన్ని సంపాదించు కుంటే భవిష్యత్‌లో మరింత ఎక్కువ మొత్తం రుణాలు. పొందే అవకాశం ఉంటుందన్నారు. దీన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోసెస్, గోకిన సునేత్రా దేవి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాపారులకు చెక్కు అందిస్తున్న దవులూరి దొరబాబు

## వాకర్స్ క్లబ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు వాకర్స్ క్లబ్ అందిస్తున్న సేవలు మరువలేనివని ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎం అన్నారు. ప్రపంచ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇటీవల కాకినాడ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన హాకీ ఆటలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ సభ్యులన్నుఉ ఆహ్వానించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొవ్వూరి విజయను సత్కరించారు. వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు సిహెచ్.సతీష్ ఇచ్చిన సలహాలు మేరకు రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని ఆట వస్తువులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు బంధన మణికంఠ, జగన్, బొబ్బిలి అర్జున్ కుమార్, స్పోర్ట్స్ అధ్యక్షుడు డానియల్ పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## డయల్ యువర్ కలెక్టర్ అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నామని, ఫోను ద్వారా తెలియజేసిన సమస్యలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. 13 మంది నుంచి ఫోన్‌లో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడారు. సమస్యలను సంబంధిత శాఖలకు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి పాల్గొన్నారు.

## నీలపల్లిలో ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నీలపల్లి హైస్కూల్లో హెచ్‌ఎం కె.రాధాకృష్ణ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ కాశి కరుణతో కలిసి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేశారు. జాతీయస్థాయి కర్రసాము, కుడో బాక్సింగ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఇంధన మణిదీప్ పుల్లయ్య, ఎలిపే శశి గోపి వరుణ్, కాటూరి చైతన్య, రేవు శ్రీలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఫోటో: టి ఎల్**

## ఓటర్ నమోదుకు 6,652 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గంలోని 200 పోలింగ్ బూత్‌ల పరిధిలో కొత్తగా ఓటు హక్కు నమోదుకు 6,652 దరఖాస్తులు అందాయని తహశీల్దార్, సహాయ ఎలక్ట్రోరర్ అధికారి జితేంద్ర అన్నారు. మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఓటర్ లిస్టుల ఇంటింటా సర్వేపై బిఎల్‌ఒలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన వారికి సంబంధించి 7,746 దరఖాస్తులు, ఓటరు లిస్టులో మార్పులు, సవరణలకు సంబంధించి 8,473 దరఖాస్తులు,నియోజకవర్గ వెలుపల చిరునామా మార్పు కోసం 8,196 దరఖాస్తులు అందాయన్నారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన చర్చించారు.

# 'మిత్ర బృందం' ఆధ్వర్యంలో పాలీన పుట్టినరోజు

ప్రజాశక్తి- కాకినాడ



మిత్ర బందం సేవ సంఘం, చేయూత స్వచ్ఛంద సంస్థ సమక్షంలో అనూసూరి పాలీన 10వ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర బందం సేవ సంఘం అధ్యక్షులు కాదా రామకృష్ణ మాట్లాడారు. తమ సోదరుడు అనసూరి సువర్ణరాజు, సాయి లక్ష్మి దంపతుల కుమార్తె చిన్నారి అనసూరి పాలీన పుట్టిన రోజును తమ పర్యవేక్షణ లో నిర్వహించడం ఆనంద దాయకమన్నారు. ఇటువంటి సేవ కార్యక్రమాలు మరెన్నో నిర్వహించేందుకు తమ బృందం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి చిన్నారులకు పంచారు. అనంతరం 40 మంది పిల్లలకు రెండు నెలలకు సరిపడేలా కాస్మెటిక్స్, టవల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.రవి కుమార్, కార్యదర్శి ఎం.ఎ.హలీం, మిత్ర బందం సభ్యులు గణేష్, సుహాష్, నవాజ్, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జగన్నాథపురంలో గల రైన్ బో ఆశ్రమంలో కూడా పాలీన పుట్టిన రోజును నిర్వహించారు. 35 మంది పిల్లలకు పాదరక్షలు, వాటర్ టిన్నులు, డోర్ మ్యాట్లు అందించారు. రైన్ బో ఆశ్రమం అధినేత నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంధం

# పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి

ప్రజాశక్తి - పెదపూడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సంతప్తి వ్యక్తం చేసింది. మంగళవారం రామేశ్వరంలో కేంద్ర ప్రత్యేక బృందం పర్యటించింది. రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడి కేంద్రాలు, నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలు, జలజీవన్ మిషన్‌లో నిర్మాణం అవుతున్న మంచినీటి పథకాలు, తదితర అభివృద్ధి పనులను బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ కొటికలపూడి చిన్నబాబుని కమిటీ అభినందించింది. ఈ సందర్భంగా సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సహకారంతోనే రామేశ్వరంలో ఇంతటి అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ బృందంలో అవిల్ కుమార్, ఆశీమ, అమిత్ బోరా, మనీష శాని, నాకుల్ శర్మ, పవన్ పాండే తదితరులు ఉన్నారు. ఈ బందానికి నోడల్ అధికారి ఎంఎస్ఎన్.రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అచ్చిరాజు, దేవస్థానం కమిటీ చైర్మన్ గంగుమళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు స్వాగతం పలికారు.